సేంద్రియ వ్యవసాయం చేయాలి

మొయినాబాద్‌లోని వెంకటాపూర్‌లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

షాబాద్: తిమ్మారెడ్డిగూడలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

యాచారం : రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణబాబు

మొయినాబాద్, మే 31 : రైతులు పంటలకు రసాయన ఎరువులు తగ్గించి.. సేంద్రియ వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు లీలారాణి, సుక్రుత్‌కుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనేక కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో రైతులకు వ్యవసాయ పంటల సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చు వినియోగం తగ్గడంతో పాటు అధిక దిగుబడులను కూడా సాధించవచ్చని, అంతేకాకుండా పురుగులు, తెగుళ్లు రాకుండా నివారించవచ్చని తెలిపారు. అదే విధంగా పంటలకు పోషకాలు సమతుల్యంగా భూమిలోని అన్ని పొరల నుంచి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. భూమిలో కార్బన్ శాతం పెంచడానికి జనుములు, జీనుగులు, పెసర, పిల్లిపెసర, ఉలువలను చల్లి భూమిలో కలియదున్నుతే పంటకు ఎంతో ఉపయోగం అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు వేప, రావి, మర్రి, చింత వృక్షాలను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, ఏఈవో కుమార్, మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్, ఆదర్శ రైతులు మోహన్‌రెడ్డి, రవిందర్, కృష్ణ, సత్యనారాయణ, పీహెచ్‌డీ విద్యార్థులు తరుణ్, నవ్య, రైతులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్: చన్‌వెల్లిలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

అధునాతన పంట విధానాలతో అధిక దిగుబడులు

షాబాద్, మే 31: ఆధునాతన పంట విధానాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రియా, సుధీర్, శ్రీకృష్ణ, దిలీప్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డిజిల్లా, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధానంగా రైతుల్లో అభివృద్ధి చెందిన వ్యవసాయ సాంకేతిక, స్థిరమైన వ్యవసాయ విధానాల స్వీకరణపై అవగాహన కల్పించడం ద్వారా దిగుబడి, ఆదాయాన్ని పెంచడానికి దోహదపడుతుందని చెప్పారు. అధిక లాభం కలిగించే తోటల సాంకేతికతలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికత ప్రయోగాలపై రైతులకు వివరించడం జరిగిందన్నారు. రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను శాస్త్రీయంగా సేకరించడం జరిగిందన్నారు. వాటిని విశ్లేషించి మట్టిలో పోషకాల స్థితిని గుర్తించి, సరైన, సమతుల్య ఎరువుల వినియోగం కోసం నిపుణులు సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆర్థిక సాయం, సబ్సిడీలు, సాంకేతిక మద్దతును పొందడం, వినియోగించడంపై రైతులకు సూచనలు అందించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవో గీత, ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగాన్ని తగ్గించాలి

యాచారం, మే31: రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్త రామకృష్ణ బాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ రంగంలో చేపట్టాల్సిన అనేక అంశాలపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : వికసిత్ సంకల్ప్ అభియాన్ – 2025 కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మండల పరిధి చన్‌వెల్లి, పామేనా గ్రామాల్లో శనివారం రైతులకు పంటల సాగు, సాంకేతిక విధానాలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శ్రీకృష్ణ, డాక్టర్ ప్రియ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, మండల ఉద్యానవన అధికారి కీర్తి కృష్ణ, ఏఈవోలు స్వాతి, ప్రియ, రమ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి రవినాథ్

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

యాచారం, మే31: రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ కోరారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో రైతులకు సబ్సిడీ విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రవినాథ్ మాట్లాడుతూ.. రైతులకు 50శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. వానకాలం సీజన్‌కు సంబంధించి జీలుగ 30కిలోల బస్తా ధర రూ.4275 కాగా, 50శాతం సబ్సిడీ పోగా, రైతులు రూ.2175.50 చెల్లించాలన్నారు. అలాగే వరి, కంది విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం

బడిబాట కార్యక్రమంలో ఎంఈవో మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌టౌన్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన జరుగుతుందని ఎంఈవో మనోహర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలో తక్కువ విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలు బుచ్చిగూడ, కొండన్నగూడ, కాలనీతండా, కొంగగూడ గ్రామాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో తమ చిన్నారులను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ అన్ని ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లను అందించనుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల స్వర్ణలత, యాదయ్య, నాగమణి, శ్రావణ్‌కుమార్, ఇందిరా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటయ్య, నర్సింహులు, కృష్ణ, మేఘాబాయి, సురేష్‌కుమార్, అంజన్ నాయక్, సీఆర్పీ రాధాకృష్ణ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

ఉపాధ్యాయులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్న

మంచాల, మే 31: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్న అన్నారు. శనివారం మంచాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆమె ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు సరైన వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మంచాల ఎంఈవో రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

చేవెళ్ల టౌన్, మే 31: ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హేమంత్ రావు తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో 6రోజులుగా కొనసాగిన తెలంగాణ రాష్ట్ర జన సేవాదళ్ శిక్షణ శిబిరం నేటితో ముగింపు సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హేమంతరావు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను అడ్డుకొని మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీల పైన దాడులు పెరిగాయని, మతోన్మాద మూకలు చెలరేగిపోతున్నాయని, ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, పర్వతాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, టి. రామకృష్ణ, యాదగిరి, జనసేవా దళ్ రాష్ట్ర కన్వీనర్ రమేశ్, కో కన్వీనర్ అనీల్‌కుమార్, మురళీమోహన్, కర్ణకుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, చందు యాదవ్, నాలుగు మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, కె.శ్రీనివాస్, జంగయ్య, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, గండిపేట్ మండల కార్యదర్శి స్వామి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, మీనాక్షి, మక్బూల్, రైతు సంఘం నాయకులు సుభాన్ రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ, బాబురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నేతలు, తదితరులు

సంక్షేమం దిశగా కృషి

నందిగామ, మే31: అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలంలోని మోత్కులగూడ, ఈదుల పల్లి, శ్రీనివాసులగూడ, మజీద్ మామిడి పల్లి, మంచన్ పహాడ్ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి అధికారులతో సర్వే చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ, మాజీ ఎంపీటీసీలు కుమారస్వామిగౌడ్, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, స్వామి, ప్రభాకర్, నాయకులు సుదర్శన్, నవీన్‌గౌడ్, రాజలింగం గౌడ్, శేఖర్‌రెడ్డి, సత్తిష్, గోపాల్‌రెడ్డి, శేఖర్ గౌడ్, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి

షాద్‌నగర్‌టౌన్, మే 31: షాద్ నగర్ కోర్టు ఆవరణలో బీటీ రోడ్డు, రెండువ అంతస్తులో అదనపు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు, న్యాయవాదులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అదే విధంగా కోర్టులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, రమేష్, శ్రీశైలం, విజయ్ కుమార్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ఘన సన్మానం

కేశంపేట, మే 31 : ఎంపీహెచ్ఈవో ఉపేందర్‌రెడ్డి సేవలు అభినందనీయమని కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య అన్నారు. మండలంలోని కొత్తపేట సమీపంలోని ఓ మినీ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఉపేందర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సభలో ఇన్‌చార్జి ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో సేవాభావం, క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసేవారని, ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో గడువాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి రజిత దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిఖిత, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశలు, పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, పెంటతండాల్లో శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రునాయక్, కిషోర్, ఆశ వర్కర్లతో కలిసి గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉప్పల ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- ఆమనగల్లు, మే 31

భరతనాట్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓంకార పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ చెన్నై నిర్వాహకులు గురువు, నాట్యరత్నం ప్రతీష్ శివానందం, పీఠా ప్రతీష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలు అలరించింది. మోనిష, సాధనశ్రీ , జోషిక ,జీవన, కార్తీక, పూర్విత, నేత్ర, శుభశ్రీ, మేఘశ్రీ ప్రదర్శించిన తీరు అలరించాయి.

- కొండాపూర్

మాజీ సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాల అందజేత

కడ్తాల్, మే 31: ఆదివాసీల, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ అభియాన్ పథకాన్ని అమలు చేసినట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీలకు మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించడానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూపొందించిన ప్రణాళికలో భాగంగా 2024-25 కాల వ్యవధిలో గ్రామ సర్పంచ్‌లు అందించిన సేవలకుగానూ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కడ్తాల్, అన్మాస్‌పల్లి, ఏక్వాయిపల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లకు సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీరామ్‌మోహన్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, విద్యుత్ శాఖ ఏడీఏ బాల కృష్ణ, ఏఈ నరేందర్, మాజీ వార్డు సభ్యులు రామచంద్రయ్య, నాయకులు అశోక్‌ముదిరాజ్, కృష్ణయ్య, యాదయ్యగౌడ్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు. మే 31: విత్తనాల డీలర్లు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి డీలర్లకు సూచించారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో డివిజన్ స్థాయి విత్తన, పురుగు మందులు, ఎరువుల డీలర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఏడీఏ శోభారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన డీలర్లు విధిగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే దానికి సంబంధించిన బిల్లులను రైతులకు అందించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను విత్తన రిజిస్టర్‌లో పొందుపర్చాలని సూచించారు. విత్తనాల లైసెన్స్ వివరాలు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ లలిత, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, అరుణకుమారి, రేణుకా చక్రవర్తిని, ఎస్ ఐలు సీతారాంరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, శ్రీకాంత్, డివిజన్ ఏఈవోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

హయత్ నగర్, మే 31: రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజపూర్ గ్రామానికి చెందిన కట్ట రాజు(41) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. రోజు మాదిరిగానే ఈ నెల 29న పనులు ముగించుకొని పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డి పాలెం నుంచి తన మోటర్ సైకిల్‌పై అనాజ్‌పూర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దఅంబర్‌పేట ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి మేనల్లుడు భూపతి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి నాటకానికి ఆర్థికసాయం

కొందుర్గు, మే 31 : కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకానికి శనివారం రూ.25వేలను మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, కళాకారులను ప్రోత్సహించి మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో గోపాల్, లక్ష్యయ్యగౌడ్, శ్రీనివాస్, కృష్ణ, జగన్‌గౌడ్, వెంకటేశ్, అనిల్, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 31 : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం జూన్ 3 నుంచి 23 వరకు గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, మాడ్గుల మండలాల రెవెన్యూ అధికారులు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు ప్రతి గ్రామంలో ప్రజల వద్దకే వెళ్లి నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సుల ద్వారా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ ఈ సదస్సులో పాల్గొనే విధంగా కిందిస్థాయి అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కేశంపేట : మండలంలో జూన్ 3నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆజంఅలీ శనివారం తెలిపారు. రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి సదస్సుల్లో పాల్గొంటారన్నారు. జూన్ 3న బొదునంపల్లి, లింగంధన, 4న లేమామిడి, ఇప్పలపల్లి, 5న కొత్తపేట, ఖైర్తాబ్‌పల్లి, 6న సంతాపూర్, ఎక్లాస్‌ఖాన్‌పేట, 9న దత్తాయపల్లి, చింతకుంటపల్లి, 10న తొమ్మిదిరేకుల, చౌలపల్లి, 11, 12న నిర్దవెల్లి, వేములనర్స, 13, 16న అల్వాల, పోమాల్‌పల్లి, 17, 18న కేశంపేట, కాకునూరు, 19, 20న సంగెం, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో సదస్సులు ఉంటాయని, భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరింపజేసుకోవాలని ప్రజలను కోరారు.

ఆమనగల్లు : భూ భారతి చట్టం 2025లో భాగంగా మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో జూన్ 3 నుంచి 16 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ లలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో తహసీల్దార్ లలిత మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

షాబాద్, మే 31: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరిగా ఉంటుందని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సూపర్‌వైజర్ రమాదేవిని ఎంపీడీవో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో హెప్‌జీబా, సూపర్‌వైజర్లు సృజన, పారిజాత, సునీత, యశ్విని, అనురాధ, శకుంతల, రేవతి, జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని మేనేజర్‌గా పనిచేసిన రామచందర్‌రావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, సోమ్లానాయక్, నాయకులు సుదర్శన్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహా, జనార్ధనాచారి, షాద్‌నగర్ మున్సిపల్ పూర్వ కమిషనర్ వెంకన్న, టీపీవో వరప్రసాద్, మేనేజర్ జగదీశ్వర్, అకౌంటెంట్ వనజ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

- కొత్తూరు, మే 31:

నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు

3.92 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
గ్రామానికి 8వేల మొక్కల చొప్పున..

ముడిమ్యాల్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు

చేవెళ్ల రూరల్, మే 31 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరిట కొనసాగిస్తోంది. గ్రామాల్లో గ్రీనరీ పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ సంవత్సరం చేవెళ్ల 25 గ్రామ పంచాయతీలు, శంకర్‌పల్లి 24 గ్రామాల్లో.. ప్రతి గ్రామంలో 8 వేల మొక్కల చొప్పున 3.92 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధాన ప్రంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో లక్ష్యానికి మించి మొక్కలు నాటేందుకు మండల అధికారులు సమాయత్తమవుతున్నారు.

నిరంతర పర్యవేక్షణతో..

రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలు, క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఎంపీడీవోలు, ఎంపీవోల నిరంతర పర్యవేక్షణతో కార్యదర్శులు, వన సంరక్షకులకు సలహాలు, సూచనలు చేస్తూ హరిత లక్ష్యం సాధన దిశగా ముందుకు సాగుతున్నారు.

పచ్చదనం పెంపునకు కృషి..

ప్రభుత్వ లక్ష్యానికి అనుగు